క్లుప్తంగా

డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల జాబితా విడుదల



నోటీస్ బోర్డుపై జాబితాను అతికిస్తున్న మున్సిపల్ అధికారులు

హుస్నాబాద్: పట్టణంలో డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల జాబితాను కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం విడుదల చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య తెలిపారు. మున్సిపల్ కార్యాలయ నోటీస్ బోర్డులో జాబితాను అతికించారు. మొదటిసారి డబుల్ బెడ్రూం ఇళ్ల మంజూరు కోసం 1426 దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా అధికారులు లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. ఇందులో 489 మంది అర్హత సాధించినట్లు గుర్తించారు.

నేత్రపర్వం.. సీతారాముల కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నంగునూరు(సిద్దిపేట): నంగునూరులో కొలువైన సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో సీతారామచంద్రుల కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన, భక్తులు భజనలు చేశారు. కల్యాణోత్సవంలో ఆలయ కమిటీ చైర్మన్ రమేశ్‌గౌడ్ దంపతులు, కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్న ప్రసాదం అందజేశారు.

పేదలకు అండగా ఉంటా



ఆర్థిక సాయం అందజేస్తున్న మామిడి మోహన్ రెడ్డి

దుబ్బాక: పేదలకు అండగా ఉంటానని ప్రజాహిత ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు మామిడి మోహన్ రెడ్డి అన్నారు. మంతూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన మహ్మద్ సంజు, మురళి దాస్, రామయ్య, మల్లయ్య కుటుంబ సభ్యులను శుక్రవారం ఆయన పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ. 5 వేల చొప్పున మొత్తం రూ.20 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, జెడ్పీటీసీ యాదగిరి, వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అష్టకాలకు కన్నీటి వీడ్కోలు



అష్టకాల అంతిమ యాత్రలో కవులు, సాహితీవేత్తలు

చిన్నకోడూరు(సిద్దిపేట): అవధాన సరస్వతి, జ్యోతిష్య పండితుడు, కవి, రచయిత అష్టకాల నరసింహరామశర్మ పార్థివ దేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. శుక్రవారం మండల పరిధిలోని అనంతసాగర్ శివారులోని సరస్వతీ క్షేత్రం వద్ద అశ్రునయనాల మధ్య దహన సంస్కారాలు జరిగాయి. జిల్లాలోని కవులు, రచయితలు, సాహితీవేత్తలు ఆయన అంతిమయాత్రలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. గ్రామ సర్పంచ్ చామకూర విజయ, ఎంపీటీసీ సరితలతో పాటు ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, పండితులు, అర్చకులు నివాళులర్పించారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

గజ్వేల్‌రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ అంబేడ్కర్ గొప్పదనం తెలుసుకోకుండా ఇష్టారీతిన మాట్లాడొద్దని, విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో దళిత, ప్రజా సంఘాల నాయకులు తుమ్మ శ్రీనివాస్, పొన్నాల కుమార్, చిప్పల యాదగిరి, నీరుడి స్వామి, బ్యాగరి యాదగిరి, నీరుడి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశానికి హాజరుకానున్న చాడ

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో శనివారం నిర్వహించనున్న బెజ్జంకి, గన్నేరువరం మండలాల కౌన్సిల్ సమావేశానికి సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి, కరీంనగర్, సిద్దిపేట జిల్లా కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద పవన్ హాజరవుతున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి బొనగిరి రూపేష్ శుక్రవారం తెలిపారు సమావేశానికి ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

పరుగు.. ఆరోగ్యం మెరుగు

- 12న హుస్నాబాద్‌లో మారథాన్
- పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోటీలు
- 2037 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు నమోదు



మారథాన్‌లో యువత (ఫైల్)

హుస్నాబాద్: ప్రపంచంతో పోటీ పడుతూ ఆరోగ్యాన్ని పట్టించుకోకపోవడంతో శరీరంపై ఒత్తిడి పెరిగి చాలా మంది అనారోగ్యానికి గురవుతున్నారు. ఆస్పత్రుల పాలు కాకముందే ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి, భోజనం, ప్రతీ రోజు వ్యాయామం చేస్తే ఫలితం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. దీనిలో భాగంగా హుస్నాబాద్ పోలీస్ శాఖ, హుస్నాబాద్ రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న హుస్నాబాద్‌లో హాఫ్ మారథాన్ రన్నింగ్ పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 6 వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించగా, సుమారు 2,037 మంది నమోదు చేసుకున్నారు.

విస్తృత ప్రచారం

- 2022 మార్చి 27న, 2022, జూన్ 2న 30 ఏళ్లు పైబడిన మహిళలకు మారథాన్ నిర్వహించారు.
- ఈనెల 12న నిర్వహించే మూడో హాఫ్ మారథాన్ పోటీలకు హుస్నాబాద్ వేదిక కాబోతుంది.
- మారథాన్‌ను విజయవంతం చేసేందుకు పోలీస్ అధికారులు సన్నద్ధమయ్యారు. సినీ హీరో సంపూర్ణేష్ బాబు, దర్శకుడు వినయ్‌బాబుతో పాటు బుల్లితెర, యూట్యూబ్ స్టార్స్‌ల వీడియోలతో ప్రచారం కల్పిస్తున్నారు. స్టార్ల వీడియో వాయిస్‌ను వాట్సాప్ గ్రూప్‌ల్లో వైరల్ చేస్తున్నారు.
- పోటీలను రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, సీపీ శ్వేత ప్రారంభించనున్నారు.

మారథాన్ ఇలా..

- యువతీ, యువకులకు వేర్వేరుగా 5కె, 10కె, 21కె రన్నింగ్ పోటీలు నిర్వహించనున్నారు.
- పోటీలో పాల్గొనే వారికి ఈనెల 11న ఉదయం 9 గంటలకు రాజరాజేశ్వర కల్యాణ మండపంలో టీ షర్ట్‌లను అందజేయనున్నట్లు తెలిపారు.
- 12న ఉదయం 6 గంటలకు ఏనే దగ్గర 21 కె రన్ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ మారథాన్ అక్కన్నపేట కేంద్రం చేరుకుని, తిరిగి హుస్నాబాద్‌లో ఏనే వద్ద ముగియనుంది.
- ఉదయం 6.15 గంటలకు ఏనే దగ్గర 10కె పోటీ ప్రారంభమై అక్కన్నపేట రోడ్డు చౌటపల్లి క్రాస్ వరకు కొనసాగి, తిరిగి ఏనే వద్ద ముగుస్తుంది.
- 5కె రన్ పోటీలు ఉదయం 6.30 గంటలకు ఏనే దగ్గర ప్రారంభమై పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, ఆస్పత్రి బైపాస్ రోడ్డు నుంచి అనబేరి, మల్లెచెట్టు చౌరస్తాల మీదుగా కొనసాగి తిరిగి ఏనే వద్ద ముగుస్తుంది.

నగదు పురస్కారం

21 కె రన్ పురుషులు, మహిళలకు ప్రథమ బహుమతిగా రూ.25వేలు, రెండో బహుమతిగా రూ.15వేలు, మూడో బహుమతిగా రూ.10వేలు అందిస్తారు. 10కె పోటీలో విజేతలకు (పురుషులు, మహిళలకు) ప్రథమ రూ.10వేలు, ద్వితీయ రూ.7వేలు, తృతీయ రూ.5వేలు అందిస్తారు. 5కె రన్‌లో విజేతలకు ప్రథమ రూ.7,500, ద్వితీయ రూ.5వేలు, తృతీయ రూ.2,500 అందజేయనున్నారు.

విజయవంతం చేయాలి



యువత ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉండేందుకు, ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు సీపీ శ్వేత ఆదేశాల మేరకు మారథాన్ పోటీలను నిర్వహిస్తున్నాం. ఇప్పటికే ఆయా గ్రామాలకు చెందిన యువత పేర్లను నమోదు చేసుకున్నారు. పోటీలను విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలి.

– ఎర్రల కిరణ్, సీఐ, హుస్నాబాద్

ఆరోగ్య సమాజమే లక్ష్యం

మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల



అద్దాలు పెడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

సిద్దిపేటజోన్: ఆరోగ్య సమాజం, అంధత్వ రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యా శాఖ మంత్రి హరీశ్‌రావు లక్ష్యంగా పెట్టుకున్నారని మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్స్ అన్నారు. శుక్రవారం సంఘమిత్ర కళాశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి కాశీనాథ్, మంత్రి ఓఎస్డీ బాలరాజుతో కలిసి సందర్శించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు సాయి కుమార్, అరవింద్ పాల్గొన్నారు.

దుబ్బాకటౌన్: ప్రభుత్వం ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా చేపట్టిన కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 18వ వార్డులో కంటి వెలుగు శిబిరంను పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ గణేష్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ, భాను, మధు, పుష్పాంజలి, వైద్యులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కేసీఆర్ అవినీతి పాలనకు చరమగీతం పాడాలి

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్రంలో సాగుతున్న కేసీఆర్ అవినీతి పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజా గోస- బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న 11 వేల స్ట్రీట్ కార్నర్ సమావేశాలను శుక్రవారం మండల పరిధిలోని తాడూరులో ప్రారంభించారు. తాడూరు, చిట్యాల శక్తి కేంద్రం ఇన్‌చార్జి నర్ర మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది బీజేపీ సర్కారేనని, కేసీఆర్ అవినీతి పాలనకు ప్రజలు చరమగీతం పాడాలన్నారు. ప్రభుత్వ అవినీతిని ప్రజలందరికీ తెలియజేసే విధంగా ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కాశెట్టి పాండుపటేల్, జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేష్‌గౌడ్, జనగామ జిల్లా అధ్యక్షుడు అరుట్ల దశమంతరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ బల్ల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు కెవిఎల్ఎన్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని పీర్లపల్లిలో పునరుద్ధరించిన పురాతన శివాలయంలో శుక్రవారం ప్రత్యేక పూలజు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో శివపంచాయతనం, నవగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన చేసి, గణేశ–గురు ప్రార్థన శాంతిమంత్ర పఠనం, పంచగవ్యప్రాశనం, దీక్షాధారణ ఋత్విగ్వరణం, అఖండదీపస్థాపనం, ప్రధాన కలశస్థాపన ప్రతిమాశోధనం, మంగళహారతి, తీర్థప్రసాదవితరణ చేపట్టారు. సాయంత్రం యాగశాల ప్రవేశం, కుండసంస్కారం, అగ్నిప్రతిష్ఠాపనం, గణపతిహోవనం, జలాధివాసం, ప్రదోష పూజ, నీరాజనసేవ, మంత్రపుష్పం నిర్వహించారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు వేద పండితులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు స్వాగతం పలికి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదవరెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి, ఎంపీటీసీ మహేందర్ రెడ్డి, సభ్యులు రవీందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, జీవన్ రెడ్డి, దుర్గారెడ్డి,, భక్తులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీని వీక్షించిన దళారి చిత్ర యూనిట్

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రముఖ రచయిత, దళారి చిత్ర దర్శకుడు గోపాల్‌రెడ్డి, ఆకృతి క్రియేషన్ అధినేత, నిర్మాత ఎడవెల్లి వెంకట్ రెడ్డి, నిర్మాత అనిల్‌రెడ్డి, పీఆర్ఓ విశ్వం వీక్షించారు. క్వార్టర్ ఫైనల్ విజేత హుస్నాబాద్ జట్టుకు బహుమతులు అందజేశారు. అనంతరం చిత్రయూనిట్ సభ్యులు మాట్లాడారు. మార్చిలో విడుదలవుతున్న దళారి సినిమాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, నిర్వాహకులు శ్రీనివాస్, దేవయ్య, రవి, శేషు, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

దుకాణ సముదాయాలకు వేలం



వేలం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

దుబ్బాకటౌన్: వ్యాపారపరంగా దుబ్బాకను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి అన్నారు. పట్టణంలోని 1వ, 14వ వార్డులలో నిర్మించిన దుకాణ సముదాయాలకు 2వ విడతగా మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. మొత్తం 21 దుకాణాలను నిర్మించగా జనవరి 30న నిర్వహించిన వేలంలో 4 దుకాణాలను, వ్యాపారులకు కేటాయించారు. శుక్రవారం జరిగిన వేలంలో 5 దుకాణాలను కేటాయించారు. దీంతో మిగిలిన 12 దుకాణాలకు త్వరలోనే వేలం నిర్వహిస్తామని చైర్‌పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ గణేష్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

కల్యాణం.. కమనీయం

ఘనంగా భ్రమరాంబ సహిత రామలింగేశ్వర స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బెక్కల్ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ భ్రమరాంబ సహిత రామలింగేశ్వర స్వామి కల్యాణం శుభకృత నామ సంవత్సరం మాఘబహుళ పంచమి రోజున ఆలయ అర్చకుడు శివకుమార్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కల్యాణోత్సవానికి గ్రామం తరఫున ఆలయ చైర్మన్ లింగారెడ్డి దంపతులు, సర్పంచ్ బాలరాజు దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా స్వామివారి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో ఊరేగించారు. స్వామివారి కల్యాణోత్సవానికి మండలంలోని గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాములు, అర్చకుడు భద్రప్ప, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై రైతుల ఆగ్రహం



రాస్తారోకో చేస్తున్న రైతులు

నంగునూరు(సిద్దిపేట): విద్యుత్ కోతలపై రైతులు మండిపడుతున్నారు. ఐదు రోజులుగా కరంట్ సరఫరాలో కోతలు విధించడంతో పంటలు ఎండిపోవడంతోపాటు మూగజీవాల తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆరోపిస్తూ శుక్రవారం నంగునూరులో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. ఎప్పుడు కరెంట్ వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియడంలేదని, అధికారులను అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదన్నారు. ప్రభుత్వం 24 గంట పాటు వ్యవసాయానికి కరెంట్ సరఫరా చేస్తోందని మంత్రులు అసెంబ్లీలో ప్రకటించినా కనీసం పది గంటలు కూడా ఇవ్వడంలేదన్నారు. దీంతో పనులు మానుకొని బావుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల రాస్తారోకోకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు సంఘీబావం తెలిపారు. విషయం తెలుసుకున్న రాజగోపాల్‌పేట ఎస్‌ఐ మహిపాల్ రెడ్డి అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. రాస్తారోకో చేసి ప్రజలను ఇబ్బందులు పెట్టకుండా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అధికారులు స్పందింక పోవడంతోనే రోడ్డు ఎక్కామని విద్యుత్ అధికారులు వచ్చి సమాధానం ఇస్తేనే ఆందోళన విరమిస్తామని చెప్పారు. విద్యుత్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎస్‌ఐ సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని చెప్పడంతో ఆందోళన విరమించారు.

అంధత్వ నిర్మూలనకే 'కంటివెలుగు'



హుస్నాబాద్: వృద్ధురాలికి అద్దాలు అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: రాష్ట్రంలో సంపూర్ణ అంధత్వ నిర్మూలనే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కంటి వెలుగు పథకాన్ని ప్రవేశపెట్టారని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలో శుక్రవారం 15వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అయిలేని అనిత, కౌన్సిలర్ వల్లపు రాజు, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కో ఆప్షన్ సభ్యులు శంకర్ రెడ్డి, అయూబ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షల సంఖ్య పెంచాలి

బెజ్జంకి(సిద్దిపేట): కంటి వెలుగు కేంద్రాలో ప్రతీ రోజు 200 మందికి పరీక్షలు జరిగేలా చూడాలని బీసీ సంక్షేమ శాఖ, జిల్లా మానిటరింగ్ అధికారి సరోజ సిబ్బందిని ఆదేశించారు. బెజ్జంకిలోని కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం సందర్శించారు. పరీక్షలు పూర్తయినవారికి అద్దాలను అందించాలని స సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ దమ్మని రాము, ఎంపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ ద్యావనపెల్లి మంజుల, కార్యదర్శులు సురేష్, రాజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని సలాఖపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరాన్ని మద్దూరు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఇర్రి రాజేశ్వర్‌రెడ్డి,బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు గూడ రవీందర్,వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి మరుగుదొడ్లు

సాక్షి ఎఫెక్ట్..



దుబ్బాక: ఇటీవల సాక్షిలో 'బస్టాండ్‌లో ప్రయాణికులకు వసతులు కరువు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దుబ్బాకలో నూతనంగా నిర్మించిన బస్టాండ్‌లో మరుగుదొడ్లు అందుబాటులో లేక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరుగుదొడ్ల తాళాలు తీసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ

కొండపాక(గజ్వేల్): జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రైతు బంధు సమితీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్ అన్నారు. మండలంలోని రవీంద్రనగర్ శివారులో ప్రభుత్వం కేటాయించిన జర్నలిస్టుల కాలనీలో ఇండ్ల నిర్మాణాలకు శుక్రవారం సర్పంచ్‌లు పుల్లోజు కిరణ్‌కుమార్, మహిపాల్, పీఏసీఎస్ డైరెక్టర్ బూర్గుల సురేందర్ రావు, బీఆర్ఎస్ సీనియర్ అనంతుల నరేందర్‌తో, కుకునూరుపల్లి సర్పంచ్ పాల్కంపల్లి జయంతి, మండల కోఆప్షన్ సభ్యుడు ఆజిమొద్దీన్ భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలిచే జర్నలిస్టుల ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అమలు చేసే రూ. 3లక్షల పథకం వర్తించేలా కృషి చేస్తామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బీఆర్ఎస్ బలోపేతానికి కృషి

తొగుట(దుబ్బాక): బీఆర్ఎస్ బలోపేతానికి యువత నిరంతరం కృషిచేస్తుందని మండల యువత అధ్యక్షుడు మాదాసు అరుణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండల యువత నూతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ ఉపాధ్యక్షుడు వికాస్, భైరవరెడ్డి, కనకరాజు, ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్, సంతోష్‌రెడ్డి, సురేష్ గౌడ్, కోశాధికారి నాగరాజు, సంయుక్త కార్యదర్శులు ఆంజనేయులు, ఎల్లాగౌడ్, కార్యవర్గ సభ్యులుగా వెంకటేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

◆ పేదింటి వధువుకు సాయం

దుబ్బాక: లచ్చపేట వార్డుకు చెందిన లడకబోయిన భారతి యాదగిరి దంపతుల కుమార్తె మౌనిక వివాహానికి ప్రజాహిత ఫౌండేషన్ చైర్మన్ మామిడి మోహన్ రెడ్డి ఆదేశాల మేర ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. పుస్తె మెట్టెలను ఇచ్చారు. దౌల్తాబాద్ మండలం ఇందూప్రియాల్ అంగన్‌వాడీ టీచర్, సామాజిక సేవకురాలు సుల్తాన్ ఉమర్ మౌనిక వివాహానికి 50 కిలోల బియ్యంతో పాటు పెళ్లి బట్టలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

◆ నిరుపేదలకు దళిత బంధు ఇవ్వాలి

నంగునూరు(సిద్దిపేట): ఇళ్లు, వ్యవసాయ భూమి లేని నిరుపేదలకు దళిత బంధు పథకం వర్తింపజేయాలని ఎమ్మార్పీఎస్ టీస్ జిల్లా అధికార ప్రతినిధి దేవులపల్లి రాజేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నంగునూరులో విలేకరులతో మాట్లాడారు. అర్హుల ఎంపికలో రాజకీయ జోక్యం లేకుండా కలెక్టర్, ఎంపీడీఓ సమక్షంలో గుర్తించాలన్నారు. నిరుపేదలకు దళిత బంధు పథకం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14వ తేదీన చలో ఇందిరా పార్క్ కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. అక్కడ నిర్వహించే ధర్నాకు దళిత సోదరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నర్సింలు, కిషన్, రవీందర్, భిక్షపతి, సంతు, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఇండస్ట్రియల్ టూర్‌కు విద్యార్థులు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మోడల్ స్కూల్ విద్యార్థులు ఇండస్ట్రియల్ టూర్ వెళ్లారు. శుక్రవారం సిద్దిపేటలోని సెట్విన్ చేనేత వస్త్రాలయం, గొల్లభామ చీరల తయారీ కేంద్రాలను సందర్శించారు. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులను వృత్తి విద్యా నైపుణ్యం కోసం ఇండస్ట్రియల్ టూర్ కార్యక్రమం చేపట్టినట్లు ప్రిన్సిపాల్ హర్జిత్‌కౌర్ ఆయన తెలిపారు.

◆ ఏఎంసీ మాజీ చైర్మన్ సస్పెన్షన్

బెజ్జంకి(సిద్దిపేట): పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుడున్నారనే ఆరోపణలతో బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ (ఏఎంసీ) మాజీ చైర్మన్ దేవ శ్రీనివాస్‌రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా హైకమాండ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశామన్నారు.

◆ బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

చేర్యాల(సిద్దిపేట): బీఆర్ఎస్ పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షుడు బుట్టి శ్రీనివాస్ తల్లి బుట్టి పోషవ్వ శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గుజ్జ సంపత్‌రెడ్డి కుటుంబ సభ్యుల పరామర్శించి ఓదార్చారు. పరామర్శించినవారిలో మార్కెట్ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంగోలు చంటి, రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య, పట్టణ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు ఎండి నాజర్, నాయకులు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, శివగారి అంజయ్య, చింతల పర్శ రాములు ఉన్నారు.

◆ ఉప్పలమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో చేపట్టిన ఉప్పలమ్మ దేవాలయ నిర్మాణానికి దాతులు విరాళాలు సమర్పిస్తున్నారు. శుక్రవారం పట్టణానికి చెందిన డాక్యుమెంట్ రైటర్ అంబాల శ్రీనివాస్‌గౌడ్ రూ.20,116 విరాళం అందజేశారు. విరాళాన్ని కాలనీ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులకు అందజేశాడు. కాలనీ వాసుల తరుపున వారు ధన్యవాదాలు తెలిపారు.

◆ లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం

గజ్వేల్‌రూరల్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని న్యాయవాది బత్తుల రాజు పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి వద్ద అల్పాహార పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రాజు మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో 220 రోజులుగా ఆస్పత్రికి వచ్చే ప్రజలు, రోగులకు ఉచితంగా అల్పాహారం అందించడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రజలను చైతన్యవంతులను చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్లబ్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు సత్యనారాయణ, నేతి శ్రీనివాస్, ఎల్లంరాజ్, శ్రీధర్, రాము తదితరులు పాల్గొన్నారు.

◆ సమావేశాన్ని విజయవంతం చేయండి

గజ్వేల్‌రూరల్: ఎమ్మార్పీఎస్, మహజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం నిర్వహించ తలపెట్టిన ఉమ్మడి జిల్లా సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ ముంద్రాతి కృష్ణ, ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రమేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ.. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ హరిత హోటల్ వద్ద సమావేశం జరుగుతుందని తెలిపారు. సమావేశానికి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మల్కుగల్ల రమేష్, ఆంజనేయులు, కర్ణాకర్, బాబు, రాజు, స్వామి, శివ తదితరులు పాల్గొన్నారు.

◆ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ములుగు(గజ్వేల్): గ్రామల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ ములుగు మండల ఉపాధ్యక్షుడు చాగర్ల మల్లేష్‌యాదవ్ కోరారు. వంటిమామిడిలో శుక్రవారం నిర్వహించిన నేత్ర శిబిరంలో పాల్గొని మాట్లాడారు. కంటి సమస్యలు ఉన్నవారికి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు, అద్దాలు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. ఆయనతో నాయకులు వెంకట్‌రెడ్డి, సంజీవ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ కల్వర్టు నిర్మాణానికి భూమి పూజ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మైసమ్మవాగుతండా గ్రామంలో దాదాపుగా రూ.15లక్షల వ్యయంతో కల్వర్టు నిర్మాణానికి శుక్రవారం ఎంపీపీ మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ మంగ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. పంచాయతీ రాజ్ డీఈ సదాశివరెడ్డి, ఏఈ స్నేహ, గ్రామ సర్పంచ్ లావణ్య, మాజీ జెడ్పీటీసీ భీలునాయక్, వార్డు సభ్యులు భూక్య సూరవ్వ, నూనావత్ భీముడు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పోన్నాల రవి, నాయకులు పాల్గొన్నారు.

◆ యువత క్రీడల్లో రాణించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): యువత క్రీడా రంగాల్లో రాణించాలని బీఆర్ఎస్ నాయకులు తోట కమలాకర్ రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. క్రీడాకారులు ఓటమితో కుంగిపోకుండా గెలుపునకు పట్టుదలతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మిరుదొడ్డి క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ఐలయ్య, కొండల్ రెడ్డి, విజయ్, బీఆర్ఎస్ నాయకులు లింగం, రాధకృష్ణ, బాబు, తదితరులున్నారు.

◆ కంటి అద్దాలు పంపిణీ

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో పది రోజుల పాటు నిర్వహించిన కంటి వెలుగు శిబిరంలో కంటి సమస్యలు గుర్తించిన వారికి శుక్రవారం గ్రామంలో కళ్లద్దాలను పంపిణీ చేశారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ కాశీనాథ్, ఎంపీపీ సవిత ప్రవీణ్ రెడ్డి, ఎంపీడీఓ సమ్మిరెడ్డి మాట్లాడుతూ సమస్య గుర్తించిన 92 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వంగ లక్ష్మీనరసింహారెడ్డి, ఏపీఓ శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్, కంటి వెలుగు సిబ్బంది, అంగన్ వాడీ టీచర్స్, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

◆ ఘనంగా స్వయం పాలన దినోత్సవం

నంగునూరు(సిద్దిపేట): స్వయం పాలన దినోత్సవాన్ని పాలమాకుల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం నిర్వహించిన స్వయంపాలనలో విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. హెచ్ఎంగా నస్రత్, డీఈఓగా రాజ్‌కుమార్, డిప్యూటీ డీఈఓగా రోహిత్, ఎంఈఓగా రాజు, పూజ, ప్రవీణ్, మధు, శ్రీఖాంత్ వ్యవహరించారు. చక్కగా పాఠాలు బోధించిన విద్యార్థులను హెచ్ఎం ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

◆ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం

గజ్వేల్‌రూరల్: టీఆర్ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని బీజేపీ రాష్ట్ర నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా భరత్‌నగర్ వద్ద శుక్రవారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. రాబోయే రోజుల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఉప్పల మధుసూదన్, కోఆర్డినేటర్ మనోహర్‌యాదవ్, నాయకులు రామ్మోహన్‌గౌడ్, ఎల్లు రాంరెడ్డి, గురువారెడ్డి, కప్పర ప్రసాదరావు, పేర్ల శ్రీనివాస్, కుడిక్యాల రాములు, బండారు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

